తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 16- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 73 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in





## ఎర్రకోటపై మార్మోగిన
# వందేమాతరం

- స్వాతంత్ర్య వేడుకల్లో చారిత్రక ఘట్టం
- తొలిసారి పూర్తి గీతం ఆలాపన
- జాతీయ గేయానికి పెరిగిన గౌరవం
- ప్రత్యేక ఆకర్షణగా పూలవర్షం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చరిత్రలో నిలిచిపోయే అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ చరిత్రలో తొలిసారిగా ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన అధికారిక స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి గీతాన్ని ఆలపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ఆర్మీ బ్యాండ్ వందేమాతరం గీతాన్ని వినిపించగా, అనంతరం

మిగతా 2లో

## తెలంగాణ పునర్నిర్మాణమే
# ప్రభుత్వ లక్ష్యం

### గోల్కొండలో జాతీయ పతాకావిష్కరణ

ప్రజా పాలన విజయాలను వివరించిన ముఖ్యమంత్రి
సంక్షేమం అభివృద్ధితో ముందుకు తెలంగాణ
భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన దిశ





**హైదరాబాద్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుంటూ దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గత రెండున్నరేళ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశామని, భవిష్యత్ తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాల్లో ప్రజలు, ఉద్యోగులు, అధికారులు భాగస్వాములని చెబుతూ రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం కీలకమన్నారు.

మిగతా 2లో



### పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే
## రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హనుమకొండ, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
పేదవాడి కడుపు నింపడం, ప్రతి పేద కుటుంబానికి ఆత్మ గౌరవంతో సొంతింటి నీడ కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తదితరులతో కలిసి కార్డులను పంపిణీ చేశారు.

మిగతా 2లో

### ఖిలా వరంగల్‌లో ఘనంగా
## స్వాతంత్ర్య దినోత్సవం

- మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ
- సమరయోధులకు ఘన సన్మానం
- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టింపు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం



**వరంగల్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
ఖిలా వరంగల్‌లోని ఖుషీ మహల్ ప్రాంగణం శనివారం దేశభక్తి నినాదాలతో మారుమ్రోగింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్, అటవీ శాఖ అధికారి నిఖితతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మిగతా 2లో



## నేడు పరకాలకు
## సీఎం రేవంత్‌రెడ్డి రాక

### రూ.484.42 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**పరకాల, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
పరకాల నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పరకాలలో పర్యటించనున్నారని, ఈ సందర్భంగా నియోజకవర్గంలో మొత్తం రూ.484.42 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు.
మొత్తం రూ.443.42 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు.

మిగతా 2లో



## హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీపీ సజ్జనర్
- 72 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు
- కల్తీ ఆహారం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- సాంకేతిక సేవలతో పోలీసింగ్‌కు కొత్త దిశ

**హైదరాబాద్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పేట్ల బురుజులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన సమరయోధులు, అమరవీరులను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

మిగతా 2లో

## దేశ అభివృద్ధిపై కేటీఆర్ విమర్శలు

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నేతలు
- గ్రామీణ సమస్యలను ప్రస్తావించిన కేటీఆర్
- తెలంగాణ పాలనపై ప్రశంసలు
- పార్టీ బలోపేతంపై కార్యకర్తలకు పిలుపు



**హైదరాబాద్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

మిగతా 3లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎర్రకోటపై మార్మోగిన వందేమాతరం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తైన ఏడాదిలో ఈ ఘట్టం చోటుచేసుకోవడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ఎర్రకోట బురుజులపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం 1721 ఫీల్డ్ బ్యాటరీ ఆధ్వర్యంలో స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 గన్ సెల్యూట్‌లు నిర్వహించారు. ఆ తర్వాత ఆర్మీ బ్యాండ్ వందేమాతరం గీతాన్ని వాయించింది. స్వాతంత్ర్యం అనంతరం అధికారిక వేడుకల్లో ఎర్రకోటపై వందేమాతరం గీతం పూర్తిస్థాయిలో వినిపించడం ఇదే తొలిసారి కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

వందేమాతరం గీతం ఆలాపన జరుగుతున్న సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు ఎంఐ 17 హెలికాప్టర్లు ఎర్రకోటపై పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్‌పై త్రివర్ణ పతాకం ఉండగా, మరో హెలికాప్టర్‌పై 'వందేమాతరం' అని రాసిన ప్రత్యేక పతాకం ఎగరడం అందరినీ ఆకట్టుకుంది. ఈ దృశ్యం వేడుకలకు మరింత వైభవాన్ని తీసుకువచ్చింది. దేశభక్తి ఉప్పొంగేలా చేసిన ఈ కార్యక్రమం అక్కడి ప్రజలను విశేషంగా ఆకర్షించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోటపై వందేమాతరం గీతాన్ని వినిపించడం ఇదే తొలిసారి" అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గీతం పోషించిన పాత్రను గుర్తు చేశారు. స్వదేశీ ఉద్యమం నుంచి స్వాతంత్ర్య పోరాటం వరకు ఈ గీతం కోట్లాది భారతీయుల్లో దేశభక్తిని రగిలించిందని వివరించారు. దేశ ఐక్యత, జాతీయ చైతన్యానికి ఈ గేయం ప్రతీకగా నిలిచిందన్నారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి చట్టపరమైన రక్షణ కల్పించడం కూడా ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. 'జాతీయ గౌరవ అవమానాల నివారణ (సవరణ) బిల్లు 2026'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత వందేమాతరానికి ప్రత్యేక చట్టబద్ధ రక్షణ లభించింది. ఈ చట్టం ప్రకారం వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా అవమానించడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు రాష్ట్రపతి జాతినుద్దేశించి చేసిన ప్రసంగానికి ముందు, తర్వాత కూడా వందేమాతరం పూర్తి గీతాన్ని ప్రసారం చేయడం విశేషంగా నిలిచింది. స్వదేశీ ఉద్యమ సమయంలో ఈ గీతం ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించిందని రాష్ట్రపతి గుర్తు చేశారు. కొత్త చట్టం అమలులోకి రావడంతో జాతీయ గేయానికి జాతీయ గీతంతో సమానమైన గౌరవం, రక్షణ లభించినట్లు భావిస్తున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చోటుచేసుకున్న ఈ చారిత్రక ఘట్టం భారత స్వాతంత్ర్య చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోనుంది.



## తెలంగాణ పునర్నిర్మాణమే
# ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గత 32 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, పెట్టుబడుల ఆకర్షణ వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 202526లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ సగటు కంటే దాదాపు 91 శాతం అధికమని వెల్లడించారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి "తెలంగాణ రైజింగ్ 2047" అనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతికత, నైపుణ్యాభివృద్ధికి బలమైన పునాదులు వేసినట్లు పేర్కొన్నారు.

రైతు సంక్షేమం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే నమ్మకంతో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు రాజీపడబోమని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సామాజిక భద్రతా పింఛన్లు వంటి కార్యక్రమాల ద్వారా కోట్లాది మందికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

విద్య, ఉపాధి, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను కూడా ముఖ్యమంత్రి వివరించారు. గత 32 నెలల్లో ప్రభుత్వ శాఖల్లో 72 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, డీఎస్సీ నియామకాలను విజయవంతంగా పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. గోషామహల్‌లో రెండువేల పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పలు కొత్త వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, పారా మెడికల్ సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్, ఆహార కల్తీ నియంత్రణ కోసం ప్రత్యేకంగా "టీజీ సేఫ్" వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోందని, అందుకే ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12 లక్షలకు పైగా పెరిగాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, కొత్త పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు హైదరాబాద్ రూపురేఖలను మార్చబోతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు లక్ష్యాలను సమాంతరంగా సాధిస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో స్పష్టం చేశారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించే వరకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

పేదింటి ఆడబిడ్డ కూడా నాణ్యమైన బియ్యం తినాలనే ఉద్దేశంతో సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఉండటంతో లబ్ధిదారులు తమ ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లోనూ సరుకులు పొందే అవకాశం కలుగుతుందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. వరంగల్ అభివృద్ధికి సుమారు రూ.5,700 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. ఇది పేదవాడి కష్టం, బాధ తెలిసిన ప్రభుత్వమని, కష్టం వచ్చినప్పుడు అండగా నిలిచే ప్రభుత్వమని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం:**



**కడియం కావ్య**

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ వరంగల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

మామునూరు విమానాశ్రయం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా వస్త్ర పరిశ్రమల పార్కు, భూగర్భ మురుగునీటి పారుదల వంటి కీలక ప్రాజెక్టులు వరంగల్ అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. వరంగల్‌లో అత్యాధునిక బహుళ ప్రత్యేక వైద్యశాల, సమగ్ర పాఠశాలల ఏర్పాటుతో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నామని పేర్కొన్నారు. ద్వి పడక గదుల ఇళ్లతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కూడా పేదలకు అందిస్తున్నామని తెలిపారు.

**రేషన్ కార్డు పేద కుటుంబాలకు ఆధారం: బస్వరాజు సారయ్య**

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ రేషన్ కార్డు పేద కుటుంబాలకు ఆధారమని అన్నారు. రేషన్ కార్డు కలిగిన అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

**అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం: నాయిని రాజేందర్‌రెడ్డి**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాలు సహా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. నియోజకవర్గానికి 6,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**ప్రతి అర్హ కుటుంబానికి ఆహార భద్రత: కేఆర్ నాగరాజు**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించి ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత కల్పించడంతో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, ఇతర అధికారులు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు, తహసీల్దారులు, రేషన్ డీలర్లు, ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు పరకాలకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో పరకాల మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా మెరుగుదల, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, కుంకుమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా, అక్కంపేట నమూనా గ్రామం, డ్రై ప్లాంట్, యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాల, అధునాతన సాంకేతిక కేంద్రం, పరకాల-ఎర్రగట్టు గుట్ట నాలుగు లేన్ల రహదారి, విద్యుత్ ఉపకేంద్రం, ఎన్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం తదితర పనులు ఉన్నాయి.

అదేవిధంగా రూ.41 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి, పరకాల డిగ్రీ కళాశాల, ఆత్మకూరులో ఎన్పీడీసీఎల్ ఆధునిక డివిజన్ కార్యాలయం, ఎస్పీఎం షెడ్ వంటి ముఖ్యమైన ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

## హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో
# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమై ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అంకితభావం, ప్రతిభ కనబరిచిన 72 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా సత్కరించారు. ప్రశంసా పత్రాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న సిబ్బంది కృషి పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సిబ్బంది నిబద్ధత వల్లే నగరంలో శాంతిభద్రతలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఆహార కల్తీపై కఠిన చర్యలు చేపడుతున్నామని సజ్జనర్ వెల్లడించారు. కల్తీ ఆహారాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేకంగా హెచ్‌ఫాస్ట్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్, ఆహార భద్రత అధికారుల సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తూ కల్తీదారులపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో నిర్వహించే



ప్రధాన ఉత్సవాలు, భారీ కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని సీపీ పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలు, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి శోభాయాత్రలు, ఇటీవల ముగిసిన ఆషాఢ బోనాల ఉత్సవాల్లో పోలీసులు సమర్థవంతంగా బందోబస్తు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల సహకారంతో నగరంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

సాంకేతికతను వినియోగించి పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు సజ్జనర్ వివరించారు. సైబర్ నేరగాళ్ల ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి 'ఆపరేషన్ ఆక్టోపస్' ప్రారంభించినట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన 'సీమిత్ర' వర్చువల్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 1,700కు పైగా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదుల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంలో 'ఏఐ కాప్‌రైటర్' యాప్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని సీపీ పేర్కొన్నారు. 'స్పందనతక్షణ రక్షణ' మహిళా రెస్పాండర్ వ్యవస్థ రోజుకు సగటున 30 ఫిర్యాదులను స్వీకరిస్తూ వేగవంతమైన సేవలు అందిస్తోందన్నారు. త్వరలోనే 300 మంది మహిళా సిబ్బందికి డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరోవైపు డ్రగ్స్ నిర్మూలన కోసం హెచ్‌న్యూ విభాగాన్ని మరింత బలోపేతం చేశామని, మాదకద్రవ్యాల వ్యవహారాల్లో ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఖిలా వరంగల్‌లో ఘనంగా
# స్వాతంత్ర్య దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

. కార్యక్రమం ప్రారంభంలో మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించగా ప్రాంగణమంతా దేశభక్తి వాతావరణంతో నిండిపోయింది. అనంతరం జాతీయ గేయాలాపన మధ్య మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు మంత్రి నివాళులర్పించారు. తర్వాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, విద్యార్థులు, ప్రజలు గౌరవంగా నిలబడి దేశభక్తిని చాటుకున్నారు. పతాకావిష్కరణ అనంతరం మంత్రి పరేడ్‌ను పరిశీలించి పోలీసు సిబ్బంది క్రమశిక్షణను అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర నివేదికను ప్రజలకు వివరించారు. జిల్లాలో అమలవుతున్న పలు ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని మంత్రి వివరించారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరేలా పరిపాలన సాగుతోందని, ప్రజల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను ప్రతిబింబించే ప్రదర్శనలకు విశేష స్పందన లభించింది. చిన్నారుల ప్రతిభకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత వంటి అంశాలను ప్రతిబింబించిన కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పూలమాలలు, శాలువాలతో వారిని గౌరవించారు. ఈ సందర్భంగా కొందరు సమరయోధులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అంశాన్ని ప్రస్తావించగా, వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సభా ప్రాంగణం కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల సేవలను కొత్త తరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు జి.సంధ్యారాణి, వై.వి.గణేష్ తదితరులతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



## గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై పోసిన మట్టి బురదమయంగా మారిన రోడ్డు

**వేలేరు, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని గాంధీ విగ్రహం సమీపంలో రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తులు మట్టి పోయడంతో వర్షాకాలంలో ఆ ప్రాంతం బురదమయంగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వెంటనే గుర్తించి రోడ్డును శుభ్రపరిచి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పట్టపగలు వెలుగుతున్న వీధి లైట్లు.. పట్టించుకోని అధికారులు

**వేలేరు, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంతో పాటు పీచర, లోక్యాతండా గ్రామాల్లో పట్టపగలు కూడా వీధి లైట్లు వెలుగుతుండటంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొన్ని ప్రాంతాల్లో వీధి లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది వాటిని నిలిపివేయడానికి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వీధి లైట్లు పగటి సమయంలో వెలగడం వల్ల విద్యుత్ శక్తి వృథా కావడంతో పాటు ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం పడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ పొదుపుపై



అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు ఇలాంటి సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిశీలించి పగటి సమయంలో వీధి లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.






## వేలేరు మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వేలేరు, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కోమి ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బిల్లా యాదగిరి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ గీతాలాపనతో పాటు దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు.

## ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్న చెన్నూర్ టౌన్ సిఐ బన్సీలాల్

**మంచిర్యాల, ఆగస్ట్ 15, (తెలంగాణ ముచ్చట్లు):** విధిలో నిబద్ధతతో పాటు ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను చెన్నూరు టౌన్ సిఐ బన్సీలాల్ శనివారం ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు, స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రామగుండం కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా సిపి అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా ఉత్తమ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు, ఈ సందర్భంగా చెన్నూర్ సిఐ బన్సీలాల్ మాట్లాడుతూ ప్రశంస పత్రం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని దీనితో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.



# దేశ అభివృద్ధిపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ దేశ అభివృద్ధి, తెలంగాణ రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ భవిష్యత్ కార్యాచరణపై తన అభిప్రాయాలను వెల్లడించారు. స్వాతంత్ర్యం సాధించి ఎనిమిది దశాబ్దాలు పూర్తయినా దేశం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ రోడ్లు, విద్యుత్, తాగునీరు, విద్యా సౌకర్యాలు పూర్తిగా అందని గ్రామాలు ఉండటం బాధాకరమన్నారు. సాగునీటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దేశంలో లభ్యమవుతున్న నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రపంచ దేశాల అభివృద్ధిని ప్రస్తావిస్తూ చైనా



నాలుగు దశాబ్దాల్లో సాధించిన పురోగతిని ఉదాహరణగా చూపారు. భారతదేశానికి చైనా కంటే ఎక్కువ వనరులు ఉన్నప్పటికీ వాటి వినియోగంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే సమర్థవంతమైన పరిపాలన అవసరమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ అంశంపై మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తే ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిపై ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టమైన దృష్టి లేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారని అన్నారు.
విద్యుత్ సరఫరా, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వస్తున్న విమర్శలను ఖండిస్తూ తెలంగాణ అభివృద్ధి పథంలోనే కొనసాగుతుందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం వేగంగా ముందుకు సాగిందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడుతూ జిల్లాల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ భవన్ నిర్మాణానికి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ భవనం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తామని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## సండ్రా జన్మదినం సందర్భంగా ఉచిత మంచినీటి ట్యాంకర్

- **కేక్ కట్ చేసి వేడుకలు.. ప్రజలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమం**

**సత్తుపల్లి, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ఎమ్మెల్యే, సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు సండ్రా వెంకట వీరయ్య జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీఆర్ఎస్ సత్తుపల్లి 2వ వార్డు కౌన్సిలర్ వీరపనేని రాధిక బాబి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సండ్రా వెంకట వీరయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వీరపనేని రాధిక బాబి దాతలుగా ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజల



తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా ఈ ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత



మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. తాగునీటి అవసరాలు ఉన్న సమయంలో ఈ సేవ పట్టణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సేవా కార్యక్రమాన్ని చేపట్టిన వీరపనేని రాధిక బాబిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు. ఈ సందర్భంగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ ప్రజలకు వీరపనేని రాధిక బాబి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ కూసుంపూడి మహేష్, మాజీ ఎంపీపీ దొడ్డా హైమావతి శంకరరావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొని సండ్రా వెంకట వీరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మద్దిగట్ల మోజర్ల పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు


**పెద్దమందడి,ఆగస్టు14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మద్దిగట్ల, మోజర్ల గ్రామాల్లో బ్యాండ్ మేళంతో ప్రభాతభేరీ నిర్వహించి విద్యార్థులు దేశభక్తిని చాటారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు పి. వెంకటస్వామి, శ్రీనివాసులు, వాణి ప్రభ విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యా ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు మనోజ్, మౌనిక, మాసన్నగౌడ్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతపై ప్రసంగించారు. అనంతరం మధుసూదన్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కుమార్ దీప్తి, ఆమె తల్లిదండ్రులు పాలెం రవి, మహాలక్ష్మి



లను మోజర్ల గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని సత్కరించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలకు ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గద్వాల కృష్ణ, పుల్లయ్య, ఎన్. వెంకటస్వామి, ఏ. వెంకటస్వామి, టీ.కే. ప్రవీణ్ కుమార్, కృష్ణవేణి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూర్ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కుమారి, కావేరి, గాయత్రిలను అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన ఒక్కో విద్యార్థికి 1991-1992 పదో తరగతి పూర్వ విద్యార్థుల తరఫున రూ.8,000/ గ్రామ సర్పంచ్ అశోక్ తరఫున రూ.10,000/ పాఠశాల యాజమాన్యం తరఫున ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు ఆధ్వర్యంలో




రూ.10,000/ చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించారు. అలాగే జాతీయ ప్రతిభా అన్వేషణ పథకానికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులను బహుమతులతో సత్కరించారు. రాబోయే విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు కూడా నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి సర్పంచ్ అశోక్, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తల్లిదండ్రులు, యువకులు, గ్రామ పెద్దలు, అధికారులు తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు సహకరించిన పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్యానికి ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుడిబండ శ్రీనివాస్ రెడ్డి, మద్దూర్ ఆంజనేయులు, శాంతయ్య, బండారు నరసింహ, రఘువర్ధన్ రెడ్డి, నక్కల భాస్కర్, రుక్మద్దీన్, సత్య శీలా రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెల్టూర్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సర్పంచ్ అశోక్ కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అశ్వరావుపేట డివిజనల్ కార్యదర్శిగా సతీష్ కుమార్

- **ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా.**
- **బాధితులకు అండగా నిలుస్తా.**

**దమ్మపేట, ఆగస్టు 15(తెలంగాణ ముచ్చట్లు):** స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో అశ్వరావుపేట డివిజనల్ కార్యదర్శిగా సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు దమ్మపేట మండల రెవెన్యూ తహసీల్దార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ) మద్దినేని మురళి చేతుల మీదుగా సతీష్ కుమార్‌కు నియామక గుర్తింపు కార్డును అందజేశారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో డివిజనల్ కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ ఛైర్మన్ వెంకన్న నాయక్, సందీప్ కుమార్, పి. రామారావు, వీరస్వామి, ఖమ్మం జిల్లా ఛైర్మన్ నందు నాయక్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు వీర ప్రతాప్‌లకు



ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు అవినీతి నిర్మూలనకు తన వంతు కృషి చేస్తానన్నారు. హక్కుల ఉల్లంఘనకు గురైన బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. అసోసియేషన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సతీష్ కుమార్ స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం

- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**



స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలు, వారి త్యాగాలు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రేడియంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ..ఎన్నో ఏళ్ల బానిస సంకెళ్లను తెంచేందుకు స్వాతంత్ర్య సమరయోధులు ప్రదర్శించిన పోరాట పటిమ, ధైర్యసాహసాలు, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి కోసం బాధ్యతాయుత పౌరులుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు .ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కౌసల్య భాస్కర్, ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, వైస్ ప్రిన్సిపాల్ బి. రాము, ఉపాధ్యాయులు రాహుల్, శాంతయ్య, రవి, శ్రీనివాస్, అఖిల్, మల్లేష్, ఖదిరున్నిసా, రామేశ్వరి, గీత, రజిత, శ్వేత, సరోజ, సాత్విక, జరీనా, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- **ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య వేడుకల సందడి**

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమందడి మండల కేంద్రంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పరిణత, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జలంధర్ రెడ్డి, సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి జెండాను ఎగురవేశారు.అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సూర్యగంగా జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలోనూ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జెండాకు గౌరవ వందనం సమర్పించారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ పోలీస్ సేవలు.. దామోదర్‌కు ప్రశంసా పత్రం

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దామోదర్ పోలీస్ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రం అందుకున్నారు.విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పాటు ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా ఎస్పీ సునీత రెడ్డి దామోదర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని, ఇటువంటి ప్రశంసలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని అన్నారు.ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ దామోదర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రశంసా పత్రం అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ గుర్తింపు తనలో మరింత బాధ్యత, ఉత్సాహాన్ని పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా దామోదర్ ను పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది అభినందించారు.




# ఉత్తమ పోలీస్ సేవలు.. దామోదర్‌కు ప్రశంసా పత్రం

- **సత్తుపల్లిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.**
- **- జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటిన కాంగ్రెస్ నాయకులు.**

**సత్తుపల్లి, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**



పట్టణంలోని శ్రీ సర్దార్ జలగం వెంగళరావు మున్సిపాలిటీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకుంటూ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఆంజనేయ స్వామి ఆలయానికి బండారి కుటుంబం చేయూత

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నీటి సంపును ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన నీటి మోటారు, పైపులను కీర్తిశేషులు బండారి సవరయ్య కుమారుడు బండారి పెద్ద నరసింహ వారి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు నీటి సదుపాయం కల్పించేందుకు తమ వంతు సహకారం అందించడం ద్వారా బండారి కుటుంబం భక్తి, సేవాభావం, దాతృత్వానికి ఆదర్శంగా నిలిచిందని ఆలయ అర్చకులు శివకుమార్ స్వామి తెలిపారు. ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలగనుందని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి భక్తులు అందించే సహకారం ఆధ్యాత్మిక సేవతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా బండారి పెద్ద నరసింహ వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, నరేష్, గుడిబండ శ్రీనివాస్ రెడ్డి, శాంతయ్య, రఘువర్ధన్ రెడ్డి, సత్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# 15వ బెటాలియన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సత్తుపల్లి, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**

బి.గంగారంలోని 15వ ప్రత్యేక పోలీసు పటాలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం దేశభక్తి, ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పటాలపు కమాండెంట్ ఎన్. పెద్దబాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్. పెద్దబాబు మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. వారి ఆశయాల సాధనకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాలంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పిల్లలకు కమాండెంట్ ఎన్. పెద్దబాబు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆనందోత్సాహాలతో స్వీట్లు స్వీకరించారు. కార్యక్రమంలో పటాలపు సహాయ దళాధిపతి బి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాజీపేటలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం

**కాజీపేట్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు)**

80 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట్ నగరంలో వాడ వాడ లో త్రివన్న పతాకాన్ని ఎగర వేసి దేశభక్తిని చాటుకున్నారు. డీజిల్ ఇనిస్ట్యూట్ లో సీనియర్ డిఎంఈ వెంకట్ కుమార్ జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ డి ఎం ఈ వెంకట్ కుమార్ నూతనంగా తీసుకొచ్చిన బిలియర్ స్నూకర్ టేబుల్, క్యారమ్స్ లతోపాటు వాలీబాల్ షటిల్, చెస్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో బిలియర్డ్స్ లో రవి కిరణ్, అంతయ్య స్నూకర్ లో రవికిరణ్, హరి భాస్కర్ క్యారమ్స్ లో రాముల సదానందం , జి. శ్రీనివాస్ చెస్ లో వి సాయికృష్ణ, జె సురేందర్ వాలీబాల్ విన్నర్స్ ఎం 2 టీం అండ్ రన్నర్స్ టీం మహిళా విజేతలు విజయ, హారిక, సుస్మిత లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంఈ అనికేత్ కాడే దంపతులు, ఏ డి ఎం ఈ 1 బి. శ్రీనివాసరావు, ఎడిఎంఈ 2 వి ఆర్ నాగరాజా దంపతులు ఏ డి ఈ సతీష్ ఏసీఎంటి మల్లికార్జునరావు దంపతులు లతోపాటు మజ్దూర్ యూనియన్ నాయకుడు వేద ప్రకాష్ ఇన్స్టిట్యూట్ కమిటీ సభ్యులు సల్మాన్ రాజ్, రాముల సదానందం, శంకర్, భాస్కర్ రెడ్డి, అంతోని స్వామి, నరసయ్య, అమలారావు, ఎల్ ఎఫ్ రాజశేఖర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తుఫాన్ అండ్ కార్స్ యూనియన్ కాజీపేటలో కాటా పూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దాస్యం విజయభాస్కర్ హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బొట్టు రాజు, ధర్మరాజు, నరసయ్య, నక్క మల్లయ్య ,పరమేష్, రాము, రమేష్, బాలస్వామి, మహమూద్, చిన్న యాదవ్, సదానందం కుమార్, సన్ని తోపాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.




# జమ్మికుంట స్టేషన్‌లో అనౌన్స్‌మెంట్ వ్యవస్థపై రైల్వేకు వినతి

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్ ముందు భాగంలోని సర్క్యులేటింగ్ ఏరియాలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలని డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ జీన్స్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లోని సీనియర్ డీఎస్‌టీఈ కార్యాలయంలో అధికారి గంగుల సుమన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అనుమాస శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లపై మాత్రమే పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. దీంతో స్టేషన్ బయట సర్క్యులేటింగ్ ఏరియాలో వేచి ఉండే ప్రయాణికులకు రైళ్ల రాకపోకలు, ప్లాట్‌ఫామ్‌ల వివరాలు సకాలంలో తెలియక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.



రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫామ్ మార్పులు, రైళ్ల రాకపోకలకు సంబంధించిన ప్రకటనలు స్టేషన్ బయట ఉన్న ప్రయాణికులకు కూడా స్పష్టంగా వినిపించేలా సర్క్యులేటింగ్ ఏరియాలో స్పీకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలోనూ ఈ సమస్యను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. తరచూ ప్లాట్‌ఫామ్ అనౌన్స్‌మెంట్లలో పొరపాట్లు చోటుచేసుకోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జమ్మికుంట రైల్వే స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జమ్మికుంట రైల్వే స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నేటి బాలలే రేపటి పౌరులు ఘనంగా గణతంత్ర దినోత్సవం

- **కృష్ణవేణి హైస్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**జవహర్‌నగర్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**




జవహర్‌నగర్‌లోని జన్మభూమి నగర్, ప్రగతి నగర్ పరిధిలో ఉన్న కృష్ణవేణి హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కల్పన జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు.

కరస్పాండెంట్ కల్పన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ కల్పన సహకారంతో సీనియర్ ఉపాధ్యాయురాలు చింతల స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మెరుగు శివకృష్ణ, జవహర్‌నగర్ పూసల సంఘం అధ్యక్షులు మధ్యబోయిన రాజు, బలగం టీవీ సీఈవో చింతల విజయ్‌కుమార్, స్టార్ న్యూస్ టీవీ9 రఘు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించేలా ఆకట్టుకునే నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సందేశాలతో అలరించారు. చిన్నారుల దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.

దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని ముఖ్య అతిథులు సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించాలని ఉపాధ్యాయురాలు చింతల స్వప్న అన్నారు. దేశంపై గౌరవం, బాధ్యత, ఐక్యత భావాలను విద్యార్థుల్లో పెంచడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, లావణ్య, బ్లెస్సీ జెరుష, రమణమ్మ, నాగమమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లల మధ్య ఆర్‌టీఐ సాధన కమిటీ స్వాతంత్ర్య వేడుకలు

- **పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి కమిటీ సభ్యులు**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అనాథ పిల్లల మధ్య నిర్వహించి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ మానవత్వాన్ని చాటుకుంది. జమ్మికుంటలోని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అనాథాశ్రమంలో హుజురాబాద్ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆర్‌టీఐ హుజురాబాద్ మండల అధికార ప్రతినిధి తిరగమల్ల నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనాథ పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. జాతీయ పండుగ వేళ అనాథ పిల్లలతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిలో ఆనందాన్ని నింపారు.

ఈ సందర్భంగా పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాలను సమాజంలోని ప్రతి ఒక్కరితో కలిసి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనాథ పిల్లలకు పండుగ ఆనందాన్ని పంచడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవడంతో పాటు సేవా భావాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎగ్గోజు ప్రసాద్, మాడుగుల రాజు, ఎర్ర రాజు, ఇల్లందుల రాజు, శనిగరం రవీందర్, ఆకునూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల మన్ననలు పొందిన మార్కెట్ చైర్‌పర్సన్

- **మక్కల కొనుగోళ్లలో ప్రత్యేక చొరవకు ఘన సన్మానం**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**




మక్కల కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చొరవ చూపిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందంను వావిలాల గ్రామ రైతులు ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో రైతులు తమ అభినందనలు తెలిపారు.

వావిలాల గ్రామానికి చెందిన రైతులు పొన్నం తిరుపతి గౌడ్, రాచమల్ల శివ చైర్‌పర్సన్ స్వప్న సదానందంకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటం ఉన్న గడియారాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రైతు పొన్నం తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాన్ని అందిపుచ్చుకుని ప్రజా జీవితంలోకి వచ్చిన స్వప్న సదానందం రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మక్కల కొనుగోలు సమయంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, కొనుగోళ్లలో జాప్యం లేకుండా అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ చైర్‌పర్సన్ చేసిన కృషి అభినందనీయమన్నారు.

రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రైతుల సంక్షేమం కోసం ఇదే చొరవతో పని చేయాలని ఆకాంక్షించారు.

రైతులు తనను ఘనంగా సన్మానించడం పట్ల చైర్‌పర్సన్ స్వప్న సదానందం కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

# జిఎం కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, ఆగస్టు 15, (తెలంగాణ ముచ్చట్లు)**





మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జియం రాధాకృష్ణ హాజరయ్యారు, కార్యక్రమంలో భాగంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు, అధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు, మహిళా సిబ్బందికి మరియు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు, దక్షిణ భారతదేశంలో వెలుగులు నింపుతున్న సింగరేణి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల పవర్ ప్లాంట్లకు బొగ్గు సరఫరా చేస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు, అంతేకాకుండా డైవర్సిఫికేషన్ ప్రక్రియలో భాగంగా సింగరేణి విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా విజయవంతంగా అడుగుపెట్టిందని తెలిపారు,సిఎండి మరియు డైరెక్టర్ల మార్గదర్శకత్వంలో అందరి సమిష్టి కృషితో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తే సింగరేణిని దేశంలోనే నంబర్ వన్ సంస్థగా నిలబెట్టవచ్చని పిలుపునిచ్చారు, రాబోయే రోజులలో రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ (ఫేజ్ 2) ను ప్రారంభించబోతున్నామని తెలిపారు, కార్యక్రమంలో భాగంగా మందమర్రి ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్మెంట్లలో ప్రతిభ కనబరిచిన 11 మంది ఉత్తమ ఉద్యోగులకు జిఎం చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జియం ప్రసాద్, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సిఎమ్ఓఏఐ అధ్యక్షులు ఎస్. రమేష్, డిజిఎం పర్సనల్ సిహెచ్. అశోక్, ఏరియా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- **స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత మెరుగైన సేవలు: ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**



పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. వనపర్తి జిల్లాలో 1,83,013 స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందులో అర్హులైన కుటుంబాలకు కొత్తగా 26,465 కార్డులు అందిస్తున్నామని తెలిపారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పంట రుణాల మాఫీ, రైతు భరోసా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. వనపర్తి నియోజకవర్గంలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని వనపర్తిని నిర్మించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.2 వేల కోట్ల నిధులతో వివిధ పనులు చేపట్టామని పేర్కొన్నారు.మహిళా సాధికారత, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వనపర్తి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, పౌరసరఫరాల డీఎం ఆంజనేయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బుద్వేష్‌చారికి ఉత్తమ 108 ఉద్యోగి అవార్డు

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పెద్దమందడి మండలానికి చెందిన 108 అత్యవసర సేవల ఉద్యోగి బుద్వేష్‌చారి ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు.అత్యవసర సమయాల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందిస్తూ విధుల పట్ల అంకితభావం, బాధ్యతతో పనిచేసినందుకు ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా బుద్వేష్‌చారి అవార్డును అందుకున్నారు. కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రజల ప్రాణాలను కాపాడటంలో అత్యవసర సేవల సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. అవార్డు అందుకోవడం పట్ల బుద్వేష్‌చారి సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ గుర్తింపు తనలో మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తానని తెలిపారు.

## రక్తదానంలో ఆదర్శంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**




రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సేవలను గుర్తిస్తూ రెడ్‌క్రాస్ సంస్థ అందించిన ప్రశంసా జ్ఞాపికను తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే మేఘారెడ్డికి అందజేశారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో అత్యధికంగా రక్తాన్ని సేకరించేందుకు కృషి చేసి, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ సేవలను గుర్తించిన రెడ్‌క్రాస్ సంస్థ తరఫున గవర్నర్ అందించిన ప్రశంసా జ్ఞాపికను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వనపర్తిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ రక్తదానం ఒక మహత్తర సామాజిక సేవ అని, ఒక్కరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెట్టగలదని పేర్కొన్నారు. యువత, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ, వనపర్తి మున్సిపల్ చైర్మన్, అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఉప్పల్,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమానికి ఏసీపీ వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, డీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎస్ఐ చిరంజీవి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమని పేర్కొన్న అధికారులు, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, సంయుక్త కార్యదర్శి దాస రాజు, సీనియర్ పాత్రికేయులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, మందవ శ్రీశైలం, కోడికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జమ్మికుంటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గౌరవాన్ని చాటారు.
అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని 12వ వార్డులో సుభాష్‌చంద్రబోస్ చౌరస్తాలోనూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, ఏఈ వికాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, ఆర్ఐ భాస్కర్, వార్డు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పనులు పూర్తయినా తొలగని మట్టి

- **ముందరి తండా సర్కిల్ వద్ద భారీ గుంత.. అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు**

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

మిషన్ భగీరథ పైపులైన్ పనుల కోసం రహదారిని తవ్వి పనులు పూర్తిచేసినా భారీ గుంతను సరిచేయకుండా, మట్టిని అలాగే వదిలేయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం ముందరి తండా సర్కిల్ సమీపంలో ఈ పరిస్థితి నెలకొంది.పైపులైన్ పనుల కోసం తవ్విన ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడటంతో పాటు మట్టి పెద్దఎత్తున పేరుకుపోయింది. దీంతో రహదారి ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వనపర్తి నుంచి ఖిల్లా ఘనపూర్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా పెద్దమందడి వైపు వచ్చే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్య కళ్లముందే కనిపిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. భారీ గుంతకు తోడు మట్టి పేరుకుపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.పనులు పూర్తయిన వెంటనే గుంతను పూడ్చి, మట్టిని తొలగించి రహదారిని సరి చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే భారీ గుంతను పూడ్చి, పేరుకుపోయిన మట్టిని తొలగించి రహదారిని సురక్షితంగా పునరుద్ధరించాలని వాహనదారులు, స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



# క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థుల విజయమే లక్ష్యం

- **మాట నిలబెట్టుకున్న ఉప సర్పంచ్ గణేష్ కుమార్**

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**



విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఇచ్చిన మాటను వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల ఉప సర్పంచ్, రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం కార్యదర్శి గణేష్‌కుమార్ నిలబెట్టుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు.గతంలో ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించిన గణేష్ కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు.విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గణేష్ కుమార్ ఆకాంక్షించారు. భవిష్యత్తులో విద్యార్థులకు క్రీడా పరంగా ఎలాంటి అవసరం ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

# సెయింట్ ఆంథోనీ గ్రామర్ హై స్కూల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**దమ్మాయిగూడఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మాయిగూడలో ఉన్న సెయింట్ ఆంథోనీ గ్రామర్ హై స్కూల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి స్వర్ణ కుమారి ఆధ్వర్యంలో, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ శ్రీమతి సింధు రెడ్డి సహకారంతో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీమతి స్వర్ణ కుమారి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందించాలని సూచించారు.
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించేలా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సందేశాత్మక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. చిన్నారుల దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.
దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలను ఉపాధ్యాయులు బోధించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

# జమ్మికుంట ప్రెస్ క్లబ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- *** జెండా ఆవిష్కరించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సౌడమల్ల యోహన్**

**జమ్మికుంట, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**



జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులు సౌడమల్ల యోహన్ మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. సమాజహితం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రజలకు, జర్నలిస్టు మిత్రులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా నాయకులు అరికిల భానుచందర్, దొడ్డే రాజేంద్రప్రసాద్, ఎండి కాజా ఖాన్, తోడేటి ఎల్లాస్వామి, కందుకూరి రాజు, దయ్యాల సుధాకర్, అంబాల శ్రీరామ్, కొప్పుల శ్రీరాములు, అంబాల రాజు, రచ్చ రవికృష్ణ, పెద్ది సంతోష్, కండెం వంశీ, నాగపురి రాజు, వడ్లూరి అరుణ్‌తో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలు ముక్క శ్రీనివాస్, అయితే మోహన్, మండలేముల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉద్యోగిగా ఏఓ కురుమయ్యకు అవార్డు

**వనపర్తి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

వ్యవసాయ శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న వనపర్తి ఏఓ కురుమయ్యకు జిల్లా ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు.ఎంఎల్‌సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మెఘారెడ్డి చేతుల మీదుగా కురుమయ్యకు ఉత్తమ ఉద్యోగి అవార్డును ప్రదానం చేశారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, ఉత్తమ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకోవడం పట్ల కురుమయ్యను పలువురు అధికారులు, సహచర ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.





# స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పేదవాడికి అందాలి: సీపీఐ, ఏఐటీయూసీ

**మల్కాజిగిరి, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. వినాయక్ నగర్‌లోని సీపీఐ కార్యాలయం ముందు, నేరేడ్మెట్ లేబర్ అడ్డా, డీసీఎం ట్రాలీ అడ్డా, కాకతీయ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డా వద్ద త్రివర్ణ పతాకాలను నాయకులు ఎగురవేశారు.
ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే. రవిచంద్రన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టి. యాదయ్య గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు, సహాయ కార్యదర్శి కె. అశోక్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సి.హెచ్. ఆనందరావు, కార్యదర్శి జె. వెంకటరమణ, సీపీఐ సీనియర్ నాయకులు కె. ప్రభాకర్, పి. సత్యనారాయణ, జె. రాములు, ఎస్.కె. అజీజ్, ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కృష్ణమూర్తితో పాటు ఏఐటీయూసీ నాయకులు కె. ఆనంద్, ఎస్. కె. ఖాసిం, సయ్యద్ యూసుఫ్, బీరప్ప, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కే. రవిచంద్రన్, టి. యాదయ్య గౌడ్, కాసర్ల నాగరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు సీపీఐ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు.
రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వేలేరు, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వేలేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్ జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతం, వందేమాతరం గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల మరియు గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా ప్రతినిధులు, యూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి.!

- **శ్రీ వెంకటేశ్వర ఇండేన్ గ్యాస్ సర్వీస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు.**
- **ముఖ్య అతిథిగా సీఐ తుమ్మలపల్లి శ్రీహరి.**

**సత్తుపల్లి, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** వంటగ్యాస్‌ను సురక్షితంగా, పొదుపుగా వినియోగించడంతో పాటు ప్రమాదాల నివారణపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు శ్రీ వెంకటేశ్వర ఇండేన్ గ్యాస్ సర్వీస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ తుమ్మలపల్లి శ్రీహరి హాజరయ్యారు. ఇండేన్ ఏరియా ఆఫీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్పీజీ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీకేజీని గుర్తించేందుకు అగ్గిపుల్ల ఉపయోగించరాదని, సబ్బునీటి ద్రావణంతో పరీక్షించాలని సూచించారు. లీకేజీ గుర్తిస్తే వెంటనే స్టవ్ నాబ్‌లు, రెగ్యులేటర్‌ను ఆపివేసి తలుపులు, కిటికీలు తెరిచి గాలి ప్రసరణకు అవకాశం కల్పించాలన్నారు. సిలిండర్‌ను ఎల్లప్పుడూ నిలువుగా ఉంచాలని, రబ్బరు ట్యూబ్‌ను నిర్ణీత కాలానికి మార్చాలని, వంట సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. మంట నీలిరంగులో ఉండేలా చూసుకోవడంతో పాటు గ్యాస్ పొదుపు కోసం చిన్న బర్నర్, ప్రెజర్ కుక్కర్ వినియోగం, పాత్రలకు మూతలు పెట్టి వంట చేయడం వంటి సూచనలు చేశారు. అనంతరం భద్రతా నిబంధనలు, గ్యాస్ పొదుపు పద్ధతులు, ప్రమాదాల నివారణపై ప్రశ్నలు-సమాధానాల ద్వారా వినియోగదారులకు అవగాహన కల్పించారు. 'సురక్షితమైనది.. నమ్మదగినది.. సౌకర్యవంతమైనది' అనే నినాదంతో ఎల్పీజీని జాగ్రత్తగా వినియోగించాలని నిర్వాహకులు సూచించారు.



# గాధరి సోమయ్య మరణం ముమ్మాటికీ రాంకి డంపింగ్ యార్డ్ చేసిన హత్య: పోరాట కమిటీ

**కీసర సర్కిల్, జవహర్‌నగర్ , ఆగస్టు 15. ( తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగానే గాధరి సోమయ్య మృతి చెందారని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ శావలి, కమిటీ సభ్యురాలు అల్లూరి సావిత్రి ఆరోపించారు.



వారు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 30 ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని గబ్బిలాలపేట, ఈస్ట్ నందమూరినగర్ ప్రాంతానికి వలస వచ్చిన గాధరి సోమయ్య అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. జీవనోపాధి కోసం సుమారు 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికుడిగా పనిచేశారు.

రాంకి సంస్థ నాలుగు మండలాల చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లో డంప్ చేసేందుకు ఐదేళ్ల కాలపరిమితితో ఒప్పందం చేసుకున్నప్పటికీ, ఆ తర్వాత కూడా హైదరాబాద్ నగరంలోని చెత్తను జవహర్‌నగర్‌కు తరలించి డంప్ చేస్తున్నారని వారు ఆరోపించారు. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డ్ చెత్తతో నిండిపోయిందని, దీనివల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషవాయువుల కారణంగా ప్రజలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని కమిటీ నాయకులు ఆరోపించారు. శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు తదితర అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక వైద్యపరమైన నిర్ధారణ అవసరమని వారు పేర్కొన్నారు.

డంపింగ్ యార్డ్ వల్లే గాధరి సోమయ్య మృతి చెందారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఆయన మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా గాధరి సోమయ్యకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ శావలి, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, స్థానిక బస్తీ మహిళా నాయకురాలు శారద, చికెన్ యాదగిరి, అంబేద్కర్ సంఘం స్థానిక యువ నాయకులు తురుగొండ కొమురయ్య, గుండె రాజు, జెరిపోతుల శేఖర్, జర్నలిస్ట్ గాధరి స్వామి తదితరులు నివాళులర్పించారు. అనంతరం సోమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. డంపింగ్ యార్డ్ కారణంగా అకాల మరణానికి గురయ్యారని ఆరోపిస్తున్న గాధరి సోమయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని షేక్ శావలి డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా తొలగించే వరకు ప్రజలంతా ఏకమై పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "జీవించే హక్కులో పర్యావరణ హక్కు కూడా భాగమే" అని చైతన్య మహిళా సంఘం నాయకురాలు అల్లూరి సావిత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

## విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన చల్లా శివకృష్ణ

**ధర్మసాగర్,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో గ్రామానికి చెందిన యువకుడు చల్లా శివకృష్ణ వారిని ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రథమ ర్యాంక్ సాధించిన గీతికకు రూ.5,000, ద్వితీయ ర్యాంక్ సాధించిన జాహ్నవికి రూ.3,000 నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, ఉన్నత విద్య వైపు వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ బహుమతులు అందించినట్లు చల్లా శివకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి, ఉపసర్పంచ్ పెసరు శివ, మాజీ సర్పంచ్ పెసరు రమేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జయశంకర్ కాలనీలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జవహర్‌నగర్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**

జవహర్‌నగర్ పరిధిలోని చెన్నాపురం జయశంకర్ కాలనీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ కాలనీ అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కాలనీవాసులు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ కాలనీ వాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు టీవీ అందజేత

**ఉప్పల్,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూడూరు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టీవీని అందజేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు టీవీని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సౌకర్యార్థం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టీవీ అందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి సౌకర్యాల మెరుగుదలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి,ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజుతో పాటు సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, శ్రీశైలం,కోడికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సౌకర్యాల కోసం సహకారం అందించిన పూడూరు జితేందర్ రెడ్డికి, బీఆర్ఎస్ నాయకులకు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



## వంగరలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**భీమదేవరపల్లి, ఆగస్టు 15(తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి నర్సింహరావు స్వస్థలం వంగర గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు వందనం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశం కోసం ఐక్యంగా నిలవాలని కోరారు.



కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ కుల సంఘాల నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు.

## దేశభక్తి స్ఫూర్తితో హుజురాబాద్‌లో స్వాతంత్ర్య వేడుకలు

- **టాప్రా, మెడికల్, ఆర్ఎంపీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జెండా పండుగ**

**హుజురాబాద్,ఆగష్టు 15(తెలంగాణ ముచ్చట్లు ):**



దేశభక్తి స్ఫూర్తితో హుజురాబాద్‌లో ఏనాభైయవ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో గల మమతా వైన్డింగ్ వర్క్స్ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి టాప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. టాప్రా హుజురాబాద్ యూనిట్ అధ్యక్షుడు భారత ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి భారతీయుడు నిత్యం స్మరించుకోవాలని అన్నారు. వారి ఆశయాల బాటలో నడుస్తూ దేశానికి ఉపయోగపడే ఆదర్శ పౌరులుగా ఎదగాలని సూచించారు.

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. దేశ రక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ సైనికుడిలా ఆలోచించి, దేశం కోసం అవసరమైన ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించిన టాప్రా హుజురాబాద్ శాఖ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో టాప్రా హుజురాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరాస్వామి, దాసరి మల్లేశం, దొంత హరికిషన్, గౌరీశెట్టి సాంబయ్య, ఉయ్యాల రాజేశం, బొంగోని వెంకటయ్య, మేకల మొగిలయ్య, చొల్లేటి మల్లారెడ్డి, చాడ సమీర్ రెడ్డి, శబ్ద ప్రకాష్, గాజర్ల బుచ్చిరాజం, గూడూరి స్వామిరెడ్డి, గాజే గంగయ్య, ఫారెస్ట్ అధికారి రవీందర్ రెడ్డి, తౌటం సంపత్ కుమార్, నల్ల రాజిరెడ్డి, ముక్కెర మొగిలి, గాజుల సత్యనారాయణ, కొత్తగట్టు రవీందర్ రెడ్డి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా హుజురాబాద్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్ర పాపిరెడ్డి, సంగెం శ్రీనివాస్, చింతకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు మెడికల్ షాప్ యజమానులు స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు కందకట్ల శ్రీనివాస్, చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలోనూ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆర్ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. దేశభక్తి నినాదాలు చేస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. టాప్రా, మెడికల్, ఆర్ఎంపీ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, పలువురు నాయకులు పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.



## రామడుగులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రామడుగు, ఆగస్టు 15. ( తెలంగాణ ముచ్చట్లు):** రామడుగు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జవ్వాజి హరీష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలరావుపేట వ్యవసాయ మార్కెట్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

గోపాలరావుపేట వ్యవసాయ మార్కెట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పిండి సత్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ సిబ్బంది, హమాలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## 108, 102 ఉద్యోగులకు ఉత్తమ సేవ పురస్కారాలు

**హనుమకొండ, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 108, 102 అత్యవసర సేవల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఉత్తమ సేవ పురస్కారాలు అందజేశారు.

ధర్మసాగర్ మండలం నుంచి 108 అత్యవసర వైద్య సేవల్లో ఉత్తమ సేవలు అందించిన అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు మంకిడి నాగేశ్వరరావును, 102 గర్భిణీ స్త్రీలకు అత్యుత్తమ సేవలు అందించిన కెప్టెన్ మాచర్ల వెంకటేష్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ ఎంపిక చేశారు. ఎంపికైన ఉద్యోగులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, హనుమకొండ జిల్లా నిమేనేజర్ మంద శ్రీనివాస్ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో 108, 102 సేవల సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా శాగంటి మణి

**జనగామ, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):**

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఇటీవల జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులైన శాగంటి మణికి నియామక పత్రాన్ని అందజేశారు.

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు లక్ష్మీనారాయణ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఈ సందర్భంగా శాగంటి మణి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా స్వీకరిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత నిబద్ధతతో పనిచేస్తానని, ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతానని తెలిపారు.తనకు ఈ అవకాశం కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర, జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హుజూరాబాద్‌లో స్వాతంత్ర్య సంబురాలు

- **ఆర్టీఐ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ**

**హుజూరాబాద్,ఆగష్టు 15(తెలంగాణ ముచ్చట్లు ):** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హుజూరాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కమిటీ హుజూరాబాద్ మండల అధికార ప్రతినిధి తిరగమల్ల నాగార్జున సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం పాల్గొన్న వారికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తిరగమల్ల నాగార్జున మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవడంతో పాటు దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచార హక్కు చట్టం అత్యంత కీలకమైన చట్టమని నాగార్జున పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఆర్టీఐ చట్టం పౌరులకు శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కమిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి వ్యవహరించాలని ఆయన కోరారు. అవినీతి, అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించడంలో సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో ఉన్న ప్రజాస్వామ్య సాధనమని, దాన్ని చట్ట పరిధిలో ఉపయోగించి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అలాగే హుజురాబాద్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో జెండా పండుగ అత్యంత ఘనంగా నిర్వహించిన ఎండి. ఇంతియాజుద్దీన్ సబ్ రిజిస్ట్రార్,జెండా ఎగురావేసిన అనంతరం అయన మాట్లాడుతూ మనకు స్వతంత్రం వచ్చిఏనాబై సంవత్సరాలు అవుతుంది ఇక్కడ కుల మత భేదాలు లేకుండా అందరు కలిసి జీవించడం ఒక్క భారతదేశంలోనే ఉంటుందని ప్రతి మనిషి స్వతగా జీవిస్తూ సాటి మనుషులకు సహాయం చేయాలనీ అయన అన్నారు ఈ కార్యక్రమం లో సిబ్బంది, మరియు దస్తావేజు లేఖరులు ఎం.ఏ. అజీమ్, కాజా నవాజ్ భాషా, ఎం.డి. చాంద్ పాషా, మునిగాల ఆంజనేయులు, రాజశేఖర్, మడుపు రమేష్, చొల్లేటి రాజారెడ్డి మరియు ప్లానర్లు నలుబాల వేణుగోపాల్, పి. రమేష్ ఆర్. అరుణ్ కుమార్ ఇతరులు ప్రముఖులు

**డాక్టర్ ప్రదీప్‌కుమార్‌కు ఘన సన్మానం**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం శ్రీ బాలాజీ హాస్పిటల్ డాక్టర్ టీ. ప్రదీప్‌కుమార్‌ను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పేదలు, సామాన్య ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను గుర్తించి శాలువాతో సత్కరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందిస్తూ మరింత సేవ చేయాలని డాక్టర్ ప్రదీప్‌కుమార్‌ను వారు కోరారు. సమాజంలో వైద్య రంగంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హుజూరాబాద్ మండల అధికార ప్రతినిధి తిరగమల్ల నాగార్జున, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎగ్గోజు ప్రసాద్, సైదాపూర్ మండల అధ్యక్షులు కుమార్, మాడుగుల రాజు, ఎర్ర రాజు, శనిగరం రవీందర్ , ఇల్లందుల రాజు, ఆకునూరి కుమారస్వామి, రమేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను చాటేలా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.



# ఫాదర్ కొలంబో స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఫాదర్ కొలంబో స్కూల్‌లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఫాదర్ జి. ప్రకాశ్ ప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థుల ప్రతినిధులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు .ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కరస్పాండెంట్ ఫాదర్ వై. థామస్ కిరణ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు దేశం పట్ల బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వాగత నృత్యంతో పాటు వివిధ తరగతుల విద్యార్థులు దేశభక్తి నృత్యాలు, ప్రసంగాలు, గీతాలు, నాటికలను ప్రదర్శించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు దేశభక్తిని ప్రతిబింబించే వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు 'సారే జహాన్ సే అచ్ఛా', 'వందే మాతరం' తదితర దేశభక్తి గీతాలను ఆలపించి జాతీయ స్ఫూర్తిని చాటారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథి ఫాదర్ జి. ప్రకాశ్ ప్రదీప్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వెనుక ఎందరో మహనీయుల త్యాగాలు ఉన్నాయని, విద్యార్థులు స్వాతంత్ర్య విలువలను గౌరవిస్తూ ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తితో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో ఉపాధ్యాయురాలు అనిత కృతజ్ఞతలు తెలిపారు. వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పాఠశాల సైన్స్ ప్రయోగశాలకు రూ.20 వేల విరాళం అందించిన ఉపసర్పంచ్ శివకృష్ణ

**ధర్మసాగర్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలంలోని తాటికాయల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ప్రయోగశాలకు గ్రామ ఉపసర్పంచ్ పెసరు శివకృష్ణ రూ.20 వేల విరాళం అందించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన పెసరు శివకృష్ణ సైన్స్ ప్రయోగశాలకు అవసరమైన పరికరాల కొనుగోలు కోసం రూ.20 వేల విరాళాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా ఉపసర్పంచ్ శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ప్రయోగశాలలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులు ప్రయోగాత్మక విద్య ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విరాళం అందించిన పెసరు శివకృష్ణను పాఠశాల ఉపాధ్యాయుల బృందం శాలువా కప్పి సన్మానించింది.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి, మాజీ సర్పంచ్ పెసరు రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ, వార్డు సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రామన్నపేటలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వరంగల్, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సమన్వయకర్త తాళ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సరిహద్దు భద్రతా దళం మాజీ ఉద్యోగి సయ్యద్ ఫసిద్దిన్ హుస్సేన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తిని చాటుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొడకండ్ల సదాంత్, 29వ డివిజన్ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి, ఇజ్జగిరి భీమ్రాజ్, భరతపు సంజీవ్, గొర్రె అరుణ్, ఉప్పరపల్లి రమేష్, రాధిక, సమత, సంధ్య, పుష్ప, గొల్ల రాజయ్య, సీనియర్ పాత్రికేయుడు వెంకన్న, కాపర్‌బోయిన శ్యామ్, రాగం సురేష్, బోరిగం రాములు, కాపరుబోయిన రవి, కాపర్‌బోయిన ప్రేమ్, పెద్దపెల్లి రాజు, సమ్మయ్య, కృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి

- **బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి**
- **జులైవాడలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**హనుమకొండ, ఆగస్టు 15 (తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జులైవాడలో బీఆర్ఎస్ నాయకుడు అంకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ ఎప్పటికీ స్మరించుకోవాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఆవిష్కరణ, వేడుకలకు మాత్రమే పరిమితం కాకూడదని అన్నారు. దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు, గౌరవం, భద్రత, విద్య, ఉపాధి అందినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తును నిర్మించే శక్తిగా ఎదగాలని, విద్యతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, కులం, మతం, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చేందుకు ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం కృషి చేయాలని రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తితో సమాజం, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **వెల్టూర్ పాస్టర్ సురేష్ కుమార్**

**పెద్దమందడి,ఆగస్టు15(తెలంగాణ ముచ్చట్లు):** దేశ అభివృద్ధి, ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ మన చర్చి పాస్టర్ సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండలం వెల్టూర్‌లోని న్యూ ఎస్సీ కాలనీలో గల మన చర్చి వద్ద శనివారం జాతీయ జెండాను ఎగరవేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సేవకు ప్రతి ఒక్కరూ అంకితం కావాలని అన్నారు.యువత దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక పాస్టర్, చర్చి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# ఘనంగా ప్రణవ్ జన్మదిన వేడుకలు

- **నియోజకవర్గ నలుమూలల సేవా కార్యక్రమాలు**

**హుజురాబాద్,ఆగష్టు 15 (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, వీణవంక మండలాల్లో ప్రణవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.



పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, రైతు కూలీలకు చీరల పంపిణీ నిర్వహించారు. జమ్మికుంట పట్టణం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను వొడితల ప్రణవ్ సందర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో సుమారు నూటయాభై మంది రక్తదానం చేశారు.

జన్మదినం సందర్భంగా వొడితల ప్రణవ్ హుజురాబాద్ హనుమాన్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆలయంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

అనంతరం హుజురాబాద్, జమ్మికుంట, కమలాపూర్, ఇల్లందకుంట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వొడితల ప్రణవ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత అంకితభావంతో సేవ చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, దేవస్థానాల చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్, డైరెక్టర్లు, జిల్లా నాయకులు, పట్టణ, మండల అధ్యక్షులు, మహిళా నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్, యువజన, ఎన్ఎస్‌యూఐ, మైనారిటీ, సేవాదళ్, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయానికి మహర్దశ

- **రూ.ఇరవై లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రణవ్ శ్రీకారం**

**హుజురాబాద్,ఆగష్టు 15(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్న హనుమాన్ దేవస్థాన అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ శ్రీకారం చుట్టారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) నుంచి మంజూరైన రూ.ఇరవై లక్షలతో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు.

దశాబ్దాలుగా ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఏర్పడిన వెంటనే ఆలయ అభివృద్ధి కోసం వొడితల ప్రణవ్‌కు వినతిపత్రం అందజేశామని, ఇచ్చిన మాట ప్రకారం రూ.ఇరవై లక్షల నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేశారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలకు అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఆలయ చైర్మన్ శంకర్, కమిటీ సభ్యులు, ఈఓ సుధాకర్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in